జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 28-07-2026 శ్రీకాకుళం సంపుటి: 3 సంచిక: 739 పేజీలు: 4 వెల : రూ.7



# 100 కోట్లు..
# ఎక్కడ?

శ్రీకాకుళం, జులై 27 (వార్త): కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో పర్యాటక పునరుజ్జీవ మరియు ఆధ్యాత్మిక వృద్ధి కార్యక్రమం (ప్రసాద్) పథకం కింద అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి రూ.100కోట్ల నిధులు వచ్చేటట్టు కనిపించడం లేదు. పూర్తి ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) దేవస్థానం అధికారులు కేంద్ర ప్రభుత్వానికి పంపించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఒక్క రూపాయి కూడా వచ్చిన దాఖలాలు లేవు. త్వరలో నిధులు వస్తాయని గత కొన్నేళ్లుగా కొందరు ప్రజాప్రతినిధులు ప్రకటనలతో హోరెత్తిస్తున్నారే తప్పా.. ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు కాలేదు. ఏళ్లు గడుస్తున్నా ఆ డీపీఆర్ ఏమైందో.. 'ప్రసాద్' పథకం నిధులు ఎప్పుడొస్తాయో..? తెలియని ఆయోమయ పరిస్థితి నెలకొంది. ఆలయ సుందరీకరణ, మౌలిక సౌకర్యాల కల్పన పేరుతో రెండేళ్ల కిందట పాత భవనాలను హడావుడిగా కూల్చివేశారు. కోట్ల రూపాయల విలువైన భవనాలను నేలమట్టం చేశారే తప్ప, కొత్త నిర్మాణాలను చేపట్టిన దాఖలాలు లేవు. ఈ ఆలయానికి 'ప్రసాద్' పథకం వచ్చే అవకాశాలు ప్రస్తుతానికి లేవన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అరసవల్లికి రావాల్సిన నిధులు వేరే ఆలయానికి మళ్లించేశారని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఆ పథకం మంజూరయ్యేలోగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. మాస్టర్‌ప్లాన్ సంగతేమో గానీ, ఆలయ పరిసరాల్లో తాటాకు పందిళ్లు, తాత్కాలిక ఏర్పాట్లకు లక్షల్లో నిధులు ఖర్చు చేస్తున్నారు. తాత్కాలిక ఏర్పాట్లతో రేకుల షెడ్లలో అన్నదాన కార్యక్రమం.. ఆ పక్కనే ప్రసాదాల తయారీ.. ఆరుబయటే ప్రసాదాల కౌంటర్లు.. రోడ్లపైనే వ్యాపారాలు.. అరకొరగా మరుగుదొడ్లు.. శాశ్వత ప్రణాళికకు విరుద్ధంగా ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులు చేపడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో హడావుడిగా కూల్చేసిన పక్కా భవనాలు, షెడ్ల స్థానంలో తాటాకు పందిళ్లు, తాత్కాలిక నిర్మాణాలు.. ఇదీ అరసవల్లి ఆదిత్యుని సన్నిధిలో అసౌకర్యాల తీరు, అవస్థల జోరు. రోజురోజుకూ భక్తుల రద్దీ పెరిగి, కోట్ల రూపాయల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ఆలయంలో అసౌకర్యాలు మాత్రం తిష్టవేశాయి. డీపీఆర్‌కు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాల వల్ల లక్షలాది రూపాయల నిధులు వృథా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**పాలకుల మాటలు.. నీటి మూటలు..**

కేంద్రం నుంచి ప్రసాద్ నిధులొస్తే ఆలయ రూపురేఖలు మారిపోతాయని, ఆధునిక వసతులతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని, దేశంలోనే అరసవల్లిని గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పాలకులు హోరెత్తించారు. ఆదరా బాదరాగా పాత భవనాలను కూల్చివేశారు. నాలుగేళ్లవుతున్నా శాశ్వత పనులు ప్రారంభం కాలేదు. మాస్టర్ ప్లాన్ కూడా ముందుకు సాగడం లేదు. అయితే నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణ పనులను మాత్రం ప్రారంభించారు. 'ప్రసాద్' పథకం కోసం నిరీక్షించే బదులు మాస్టర్‌ప్లాన్‌లో నిర్దేశించిన పలు అభివృద్ధి పనులను పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని నిధులను కేటాయించాల్సివుంది. ఇంద్రపుష్కరిణి ఆధునికీకరణతోపాటు ఆధునిక అన్నదాన భవనం, కేశఖండనశాల, పూర్తిస్థాయి సౌకర్యాలతో విశ్రాంతి భవనాలు, క్యూలైన్లు, మరుగుదొడ్లు, దుకాణ సముదాయం, గోశాల, ప్రసాదం కౌంటర్లు, రాజగోపుర నిర్మాణం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రధాన వేదిక, పార్కింగ్ సౌకర్యాలు వంటివి ఏర్పాటుచేయాలని మాస్టర్ ప్లాన్ రూపొందించారు. అయితే 'ప్రసాద్' పథకంలో ఆదిత్య ఆలయాన్ని చేర్చకపోవడంతో అభివృద్ధి పనులు ఇంకా కార్యరూపం దాల్చడంలేదు. ఇంద్రపుష్కరిణి పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియడం లేదు. అన్నదానం, ప్రసాదాల విక్రయం, దుకాణాల కోసం ఎప్పటినుంచో ఉన్న పాత భవనాలను ఆర్భాటంగా తొలగించడంతో, ఇప్పుడు భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. రేకులషెడ్‌లో అన్నదాన కార్యక్రమం వల్ల ఇబ్బంది పడుతున్నారు. అసౌకర్యాలను తీర్చేందుకు ఇకనైనా పాలకులు, అధికారులు చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు.

- అరసవల్లి దేవస్థానానికి.. 'ప్రసాదం' దక్కేనా?
- డీపీఆర్ సమర్పించి చేతులు దులిపేసిన దేవస్థానం అధికారులు
- రూపాయి కూడా విదల్చని కేంద్ర ప్రభుత్వం
- పెద్ద ఎత్తున ప్రసాద్ పథకం నిధులు వస్తాయని పలు భవనాలు కూల్చివేసిన అధికారులు
- తాత్కాలిక రేకుషెడ్లలోనే అన్నదానం,
- ఆరుబయటే ప్రసాదాల కౌంటర్లు
- హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు





- విశాఖకు రాక...కోణార్క్‌లో పోక!!
- సోంపేట, కంచిలి ప్రభుత్వ ఉద్యోగుల తీరు
- అడిగేవారు లేక అంతా మా ఇష్టం అంటున్న కొందరు
- సమయపాలన పాటించని అధికారులు, సిబ్బంది
- విమర్శలు వస్తున్నా పట్టించుకోని అధికారులు

# ఉద్యోగం.. ఒక్కపూటే!

సోంపేట, జులై 27 (వార్త): ప్రభుత్వ ఉద్యోగులలో కొంతమంది రూటే సెపరేట్‌లా ఉంది. సమయపాలన కనీసం కూడా పాటించకుండా ఇష్టారాజ్యంగా రావడం, పోవడం వారికే చెల్లుతుంది. అడిగే అధికారులు లేకపోవడం, కొందరు అధికారులు సైతం ఇలానే సమయపాలన పాటించకపోవడంతో వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది తీరు పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా సోంపేట, కంచిలి మండలాల్లో మండల పరిషత్తు, రెవెన్యూ, వెలుగు తదితర కార్యాలయాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు స్థానికంగా నివాసం లేకుండా సొంత ఊర్ల నుంచి రోజు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల నుంచి ఈ రెండు మండలాలకు వచ్చే ఉద్యోగులలో అనేకమంది రైళ్లపై ఆధారపడుతున్నారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ లో రావడం తిరిగి సాయంత్రం 5 గంటలు కాగానే అన్నీ సర్దేసి 6 గంటలకు వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ కు చక్కగా కంచిలి స్టేషన్ కు చేరుకుంటున్నారు. ఉదయం ఇక్కడికి వచ్చే విశాఖ ఎక్స్‌ప్రెస్ సుమారు 12 గంటలకు చేరుకుంటుంది. విశాఖ ట్రైన్ దిగి కార్యాలయాలకు వెళ్లేసరికి కనీసం మరో 20 నిమిషాలు సమయం పడుతుంది. ఈ విధంగా కార్యాలయాలకు చేరుకొని కేవలం ఒక్క పూట ఉద్యోగానికే పరిమితమవుతున్నారు. ఆయా కార్యాలయాల్లో ఇటువంటి నిర్లక్ష్యాన్ని పట్టించుకోవాల్సిన పెద్ద అధికారులు చూసి చూడనట్లు వదిలేయడంతో ఏళ్ల తరబడి ఇటువంటి నిర్లక్ష్య వ్యవహారం షరా మామూలుగా సాగిపోతుంది. వివిధ పనులపై కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు అక్కడ పనిచేసే వారు గానీ సమాధానం చెప్పేవారు గానీ లేకపోవడంతో అటువంటి వారంతా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇది ఇలా ఉండగా అయ్యవార్ల రాక కోసం ఆఫీస్ అటెండర్లు కంచిలి లో గల రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లి గంటల కొద్దీ అక్కడ టైం పాస్ చేస్తూ గడుపుతున్నారు. చూసిన వారంతా మన ప్రభుత్వ వ్యవస్థ ఇలా ఉందంటూ నిట్టూర్చుతున్నారు. దీని పట్ల జిల్లా ఉన్నతాధికారులు నిఘా వేసి ఇటువంటి నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# 21 నుంచి సిక్కోలులో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు

**-క్రీడలతోనే మానసిక ప్రశాంతత, శారీరక ధృఢత్వం**

**-ఎమ్మెల్యే గొండు శంకర్**

**-పాత్రునివలస వద్ద త్వరలో ఇండోర్ స్టేడియం అందుబాటులోకి**

**- ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు**




**శ్రీకాకుళం(క్రీడలు), జులై 27 (వార్త):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా సమానమైన ఆసక్తి పెంపొందించుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమైన తైక్వాండో జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఆగస్టు 21, 22, 23 తేదీల్లో శ్రీకాకుళంలో జరగనున్న జగనన్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. పోటీల నిర్వహణకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పాత్రునివలస వద్ద ఏర్పాటు కానున్న ఇండోర్ స్టేడియం జిల్లా క్రీడాకారులకు వరంగా మారనుందని, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. వేణుగోపాలరావు అనుమతి ఇచ్చారని తెలిపారు. సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఆగస్టులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. తైక్వాండో ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన ఆత్మరక్షణ క్రీడ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎస్.ఎన్. స్వామి, హారిక కన్స్ట్రక్షన్స్ అధినేత హారిక ప్రసాద్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, సూర శ్రీను, గేదెల ఇందిరా ప్రసాద్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శాసపు జోగి నాయుడు, రెడ్డి శివకుమార్, కె.మురళి, కనకాల మురళీ కృష్ణ, కొమర మోహన్‌కృష్ణ, రెడ్డి సాయిరాం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చిన ఘనత కూటమిదే



**జి.సిగడాం, జులై 27(వార్త):** పెంట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఇంటింటికి కూటమి ప్రభుత్వం' కార్యక్రమాన్ని కూటమి ఎమ్మెల్యే నడుకుడిటి ఈశ్వరరావు ఆదేశాల మేరకు సోమవారం మక్క నారాయణ రావు ప్రతి ఇంటింటిని సందర్శించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో నెలకొన్న సమస్యలను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. ఇలాంటి ప్రజా పాలన కొనసాగితే రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగు తోందన్నారు. ప్రతిపక్ష హోదాలేని గొడ్డలి పార్టీ చేస్తున్న విమర్శలను ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో దోల పార్వతీ, మీసాల రమణ తదితరులు పాల్గొన్నారు.

## పొత్తంగి-సిరిపురంలో నేత్ర వైద్య శిబిరం



**మందస, జులై 27(వార్త):** సిరిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పొత్తంగి-సిరిపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంఘం చైర్మన్ కలెక్టర్ ఆదేశాలు ప్రకారం పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 210మంది విద్యార్థులకు మందస మండల నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న 8మందికి కంటి అద్దాలకు సిఫార్సు చేశారు. కంటి వ్యాధులు, నేత్ర సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.తారకేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్.అరుణ్, ఆశా దమయంతి పాల్గొన్నారు.

## పాత విద్యుత్ స్తంభాలు వెంటనే మార్చండి



**సోంపేట, జులై 27(వార్త):** సోంపేట మండలంలో సుమారు 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ఐరన్ స్తంభాలు వెంటనే మార్చాలని జెడ్పిటిసి సభ్యురాలు తడక యశోద, పలాసపురం మాజీ సర్పంచ్ తడక జోగారావు సోమవారం శ్రీకాకుళం గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చి సమస్యను వివరించారు. పాత స్తంభాల వలన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి వైరింగ్ చేయడం వలన అన్ని విధాలుగా బాగుంటుందని కోరారు. వీరితోపాటు వైసీపీ గ్రీవెన్స్ వింగ్ అధ్యక్షుడు రౌతు శంకరరావు కూడా పాల్గొన్నారు.

## జీడి పరిశ్రమల బందును యాజమాన్యం విరమించాలి

**- ప్రగతి శీల కార్మిక సమైక్య సంఘం డిమాండ్**

**పలాస, జులై 27 (వార్త):** ఈ నెల 24 నుంచి ఆగస్టు 3 వరకు జీడి పరిశ్రమల యాజమాన్యం జీడి పరిశ్రమలను బందు చేసి జీడి కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విధానాలను విడనాడాలని ప్రగతి శీల కార్మిక సమైక్య శ్రీకాకుళం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది. సోమవారం బొడ్డపాడు అమరుల స్మారక భవనములో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ జీడిపప్పుకు ధర లేదని, పప్పు నిల్వలు పేరుకుపోయాయని సాకు చూపించి పరిశ్రమలు బంధు ప్రకటించటం కార్మికుల పొట్ట కొట్టడమే అవుతుందని, ప్రతి సంవత్సరం పరిశ్రమ లుబందు చేయడం యాజమాన్యం అవలంబిస్తున్న ఎత్తుగడలలో భాగమేనని వారు మండిపడ్డారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులను తగ్గించుకోవడానికి ఇటువంటి బందులు చేపడుతున్నారని,లాభాలు వచ్చినప్పుడు కార్మికులకు ఎటువంటి ఇన్సెంటివ్ ఇవ్వని యాజమాన్యాలు నష్టాలు పేరుతో పరిశ్రమలను మూసివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏ పరిశ్రమ అయినా బందు చేయాలని అనుకుంటే సంబంధిత శాఖ అనుమతులు తీసుకోవాలని, జీడి యాజమాన్యం అటువంటి నిబంధనలేవి పాటించకుండా యాజమాన్యం ఇష్టారాజ్యంగా బంధు ప్రకటించటం కార్మిక చట్టాలు ఉల్లంఘించడమే అవుతుందని, జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకొని పరిశ్రమలు తెరిపించి బందు చేసిన కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రగతిశీల కార్మిక సమైక్య అధ్యక్షులు శ్రీమద్దెల ధర్మారావు, కార్యవర్గ సభ్యులు మామిడి గణపతి, కారి పురుషోత్తం, సాలిన ఈశ్వరరావు, గర్తం కూర్మారావు, గూడ మన్మధరావు, వంకల సరస్వతి, వంకల కోదండరావు తదితరులు పాల్గొన్నారు.






## రెండేళ్ల నమ్మకంతో ప్రజల్లోకి కూటమి నాయకులు

**-అమలపాడులో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం**

**- ప్రజల గడప వద్దకు ఎమ్మెల్యే శిరీష**

**- అర్హులందరికీ సంక్షేమమే లక్ష్యం**

**పలాస, జులై 27 (వార్త):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా సోమవారం వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, తల్లికి వందనం, దీపం-2, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులకు ఆర్థిక సహాయం, రూ.5కే అన్న క్యాంటీన్లు, పేదలకు గృహ నిర్మాణం, ఎన్టీఆర్ వైద్య సేవలు, సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం తదితర సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రతి ఇంటికీ చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటింటికీ కూటమి..ప్రజల నుంచి విశేష స్పందన



**పలాస, జులై 27 (వార్త):** పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు, మొగిలిపాడు లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం" డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా "తల్లికి వందనం" పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందుతోందా, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సకాలంలో అందుతున్నాయా, అన్నదాత సుఖీభవ వంటి రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరుతున్నాయా, ఇతర ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై వివరాలు సేకరించారు. . ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమకు పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో నెలకొన్న సమస్యలను అధిగమిస్తూ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటూ, సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ప్రజా కేంద్రిత పాలన కొనసాగితే రాష్ట్రంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా పార్లమెంటరీ వైస్ ప్రెసిడెంట్ గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, మల్లిపెద్ది చిన్ని, కొవ్వూరు సురేష్, కుమ్మరి శివాజీ, బుడత జగదీష్, ఆత్మారావు, బర్ల కృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న భోగాపురం ఎయిర్‌పోర్టు రంగవల్లులు

**మందస, జులై 27(వార్త):** ఉత్తరాంధ్రకే తలమానికంగా మారబోతున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం పురష్కరించుకుని పలు చోట్ల మహిళలకు రంగవల్లుల పోటీలు జరుగుతున్నాయి. వజ్రపుకొత్తూరు మండల పరిధిలో గల అన్ని వివోలలో భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం జరుగుతున్నసందర్భంగా డీఆర్ డి ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో వజ్రపుకొత్తూరు మండలంలో వివిధ గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ఆగస్టు ఒకటవ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో మన జిల్లాకు జరిగే అభివృద్ధిపై ముగ్గుల పోటీల ద్వారా అవగాహన కల్పించారు. జిల్లాలో జరిగే పారిశ్రామిక అభివృద్ధిపై రంగు రంగుల ముగ్గుల వేసి వివరించడం జరిగిందని ఏపీఎం గొడబ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమం లో సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు, సీసీలు రేణుక, వీఓఏలు, గ్రామసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



## పలాసలో రేపు వైభవంగా గురు పౌర్ణమి మహోత్సవాలు

**పలాస, జులై 27 (వార్త):** పలాసలోని శివాజీనగర్, ఆర్.టి.సి. కాంప్లెక్స్ పక్కన ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల జూలై 29 (బుధవారం) గురు పౌర్ణమి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు దువ్వాడ శ్రీధర్ (బాబా) తెలిపారు. గురువు పట్ల కృతజ్ఞత, భక్తి, శరణాగతిని వ్యక్తపరిచే ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని రోజంతా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆరతులు, అన్నప్రసాద కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.




**కార్యక్రమాల వివరాలు :**

ఉదయం 5:15 గంటలకు పవిత్ర కాకడ ఆరతి, ఉదయం 6:00 గంటలకు బాబా వారికి మంగళస్నానం అనంతరం భక్తుల చేతుల మీదుగా మూలవిరాట్‌కు క్షీరాభిషేకం. ఉదయం 7:00 గంటలకు నూతన వస్త్రాలంకరణ, కిరీటధారణ, ఉదయం 11:30 గంటలకు మహా అన్నప్రసాద వితరణ, మధ్యాహ్నం 12:00 గంటలకు మధ్యాహ్న ఆరతి, సాయంత్రం 6:15 గంటలకు ధూప్ ఆరతి, రాత్రి 9:00 గంటలకు శేజ్ ఆరతి, ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నీ ఆలయ ప్రధాన అర్చకులు ధర్మపురి వాయునందన శర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా పలాస, కాశీబుగ్గతో పాటు పరిసర ప్రాంతాల శ్రీ షిరిడి సాయి భక్తులు, ప్రజలందరూ కుటుంబ సమేతంగా హాజరై మహా అన్నప్రసాదాన్ని స్వీకరించి, శ్రీ షిరిడి సాయిబాబా వారి అనుగ్రహానికి పాత్రులు కావాలని, గురు పౌర్ణమి మహోత్సవాలను విజయవంతం చేయాలని దువ్వాడ శ్రీధర్ బాబా విజ్ఞప్తి చేశారు.

## బంద్‌కు పూర్తిస్థాయిలో మద్దతు తెలుపుతున్నాం

**- లేబర్ యూనియన్లు**



**పలాస, జులై 27 (వార్త):** బందుకు పూర్తిస్థాయిలో మా మద్దతు తెలుపుతున్నామని క్యాజు లేబర్ యూనియన్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు మద్దతు తెలిపారు. కాశీబుగ్గ పారిశ్రామిక వాడ పరిధిలోని జీడి ఉత్పత్తుల సంఘం వ్యాపార ఒడుదుడుకుల కారణంగా ఈనెల 25వ తేదీ నుండి ఆగస్టు 3వ తేదీ వరకు ఇండస్ట్రియల్ ఏరియా నందు జీడి పరిశ్రమలు బందు చేయనున్నట్లు, పలాస క్యాజు మ్యానుఫ్యాక్చర్ యజమానులు (పి.సి.ఎం.ఎం) పరిధిలో కూడా ఈనెల 27వ తేదీ నుండి ఆగస్టు 8 వరకు తమ వ్యాపార ఒడుదుడుకులవల్ల బందు నిర్వహిస్తామని కాష్యూ లేబర్ అండ్ రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ లెటర్ ద్వారా సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా కాష్యూ లేబర్ & రైస్ మిల్లర్స్ లేబర్ యూనియన్ సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు అంబటి. కృష్ణమూర్తి మాట్లాడుతూ రెండు ప్రాంతాల యూనియన్లు పరస్పరం సహకరించుకుంటూ బందుకు పూర్తి మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ యజమానులు సమగ్రమైన విచారణ జరిపి, కార్మికుల శ్రేయస్సు కోరి తక్షణ పరిష్కారాలు చూపాలని కోరారు. కార్మికుల కోసం ఉపాధి కల్పించాలని, పని షెడ్యూల్ సంబంధిత అంశాలపై చర్చలకు యజమానులు ముందుకు రానివ్వాలని విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలను కాపాడుతూ బందు నిర్వహించేందుకు స్థానిక అధికారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సానా ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, గౌరవ అధ్యక్షులు బొంపల్లి సింహాచలం, ఉప కార్యదర్శులు లక్ష్మీనారాయణ, మోహన్, రమణ, అప్పలమ్మ తదితర కార్మిక సంఘసభ్యులు పాల్గొన్నారు.

## ఆంధ్ర భవన్‌లో బీసీ సమస్యలపై ఎంపీలతో సమావేశం

**ఇచ్ఛాపురం, జులై 27 (వార్త):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఆంధ్ర భవన్‌లో బీసీ వర్గాల సమస్యలు, హక్కులు, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం వంటి కీలక అంశాలపై పార్లమెంట్ సభ్యులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య అధ్యక్షత వహించగా, పలువురు ఎంపీలు, జాతీయ నాయకులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కాళ్ల జైదేవ్ సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో బీసీ లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల సమర్థ అమలు, అలాగే కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.దేశవ్యాప్తంగా బీసీ వర్గాల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, బీసీల గొంతును పార్లమెంట్ వేదికపై మరింత బలంగా వినిపించేలా సంఘం చేస్తున్న కృషికి అందరూ మద్దతు ఇవ్వాలని జైదేవ్ పిలుపునిచ్చారు.ఈ సమావేశం అనంతరం బీసీ సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న తదుపరి కార్యాచరణపై నాయకులు చర్చించారు. ఈ కార్యక్రమం లో సాలిన ఢిల్లీరావు ,జన్నెల ప్రసాద్ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# అప్పలరాజుపై కేసు రాజకీయ కక్ష సాధింపే



**మందస, జులై 27(వార్త):** అక్రమాలను ప్రశ్నించినందుకే మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై అక్రమ కేసులు రాజకీయ కక్ష సాధింపేనని మందస మండల ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. మందస మండలంలోని కొంకడాపుట్టి పంచాయతీలోని కిల్లోయిలో జరిగిన సమావేశంలో దానయ్య మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో లిక్కర్ బాటిల్ మీద 10నుండి 20 రూపాయలు కమిషన్ తీసుకుంటున్నారు.. గ్రావెల్ కొండలు కొండలు అమ్మేస్తున్నారు.. చెరువులు ఆక్రమించుకుంటున్నారు.. భూ అక్రమాలు చేస్తున్నారు.. ఈ అక్రమాలపై అప్పలరాజు ప్రశ్నించినందునే ఈ అక్రమ అరెస్టు అని భావిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారాలు శాశ్వతం కావని, ప్రభుత్వాలు మారడం సహజమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును లక్ష్యంగా చేసుకుని అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పినట్లుగా ఏది విత్తితే అదే కోయాల్సి వస్తుంది అనే విషయాన్ని గుర్తు చేస్తూ, పలాస నియోజకవర్గంలో రాజకీయ ద్వేషం, కక్షసాధింపు అనే విష సంస్కృతికి బీజం వేశారని, దాని ఫలితాలను భవిష్యత్తులో అనుభవించక తప్పదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో పోటీ అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఉండాలని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను జైళ్లకు పంపించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి అప్పలరాజు చేసిన అభివృద్ధి పనులను ప్రజలు మరచిపోతారని భావించి ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని, అయితే ఆయన అరెస్టు తర్వాత ప్రజలు ఆయన సేవలను మరింతగా గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అప్పలరాజుకు సమాచారం అందడంతో ఆయన సంఘటనా స్థలానికి వెళ్లారని, అంతకు ముందే ఆయన కుటుంబ సభ్యులు 108 అత్యవసర సేవలకు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఒక వ్యక్తి హత్య చేయాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తే 108కు సమాచారం ఇస్తారా అనే ప్రశ్నను ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నందున కేసు వివరాలపై మరింత వ్యాఖ్యానించడం సమంజసం కాదని అన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో గానీ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎన్ని కేసులకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 105 కింద హత్య కేసులు నమోదు చేశారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఒక బీసీ నాయకుడైన డాక్టర్ సీదిరి అప్పలరాజును లక్ష్యంగా చేసుకోవడం అంటే ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా ఆ వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. ప్రతిపక్ష నాయకులను అణచివేయడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. లేదంటే ప్రజలు తగిన సమయంలో తీర్పు ఇస్తారని, ప్రజా సేవ చేసిన నాయకుడిగా కాకుండా ఒక్కసారే ఎమ్మెల్యేగా మిగిలిపోతారని ఎమ్మెల్యేకు హితవు పలికారు.

కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, జడ్పీటీసీ సవరచంద్రమ్మ, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు సేనాపతి కిషోర్, ఎంపీటీసీ కంచి బెహర, మాజీ జడ్పీటీసీ అందాల శేషగిరి, పిఏసిఎస్ మాజీ అధ్యక్షుడు సౌర డిల్లీరావు, నాగేశ్వర బృందావన్, మట్ట జయరాం, దున్న హరికృష్ణ, పులారి పితంబరం, సురేష్ పాణిగ్రాహి, బాడ జగన్, వైకుంఠరావు, కర్రి గోపాల్, కురాగౌడ, బత్తిని వెంకటేష్, మార్పు వెంకటరమణ, బత్తిన లక్ష్మణ్, హరికృష్ణ, నీలకంఠం, గున్న రమణ, శోభన్, దుర్యోధన, సవర రాము, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్దానంలో రంగవల్లుల కళకళ

**- కొనసాగుతున్న ముగ్గుల పోటీలు**



**మందస, జులై 27(వార్త):** ఉత్తరాంధ్రలోని భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని భారత ప్రధాని నరేంద్రమోదీతో ప్రారంభోత్సవానికి మందస ఉద్దానం ప్రాంతంలో మహిళలు గ్రామ గ్రామాన రంగవల్లులతో సందడి చేస్తున్నారు. ఆగస్టు ఒకటిన ముందే బస్సులలో బయలుదేరి భోగాపురం ఎయిర్ పోర్టు చూడడానికి కుటుంబ సమేతంగా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున మహిళా సంఘాలకు ఎంటర్ ప్రైనర్ లుగా తయారు కావాలనే ఉద్దేశంతో వారి పెట్టుబడి అవసరాలకు కావలసిన రుణాలును ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంకు లింకేజ్ల రూపంలో అందిస్తూ, వివిధ రకాల జీవనోపాదులను చేయడానికి వెలుగు సిబ్బంది ద్వారా ప్రోత్సహించడంతో మహిళా సంఘాలు ఉద్దానం వీధుల్లో ఇంటింటికీ ముగ్గులు వేసి సోషల్ మీడియాలో తమ రంగవల్లులను పోస్ట్ చేస్తున్నారన్నారు. ఎయిర్ పోర్ట్ ప్రారంభత్సవ కార్యక్రమంలో పాల్గొని అక్కడికి వస్తున్న అతిథులకు, నాయకులకు స్వాగతం పలుకబోతున్నారని తెలిపారు. మనకు సమీపంలో విమానాశ్రయంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి, సమీప ప్రాంతాల్లో వ్యాపారాభివృద్ధి జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కలలు సాకారం అవుతున్నట్లు భావిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వి.ఓ.ఏ.లు, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నర్తు కుటుంబానికి రూ.15వేల సాయం



**మందస, జులై 27(వార్త):** మందస మండలంలోని లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ ఇటీవల జరిగిన ఆటో ఢీకొన్న ప్రమాదంలో మరణించారు. మరణించిన నర్తు వెంకటరమణ కుటుంబానికి లొహరిబంద గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థుల బృందం 2007-2008 10వ తరగతి బ్యాచ్ తమ వంతుగా రూ.15వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. పూర్వ విద్యార్థుల ఔదార్యానికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**- అలసత్వం వహించొద్దని వంట ఏజెన్సీలకు ఎంఈఓ హెచ్చరిక**

**- గొల్లపేట పాఠశాల సందర్శన.. విద్యార్థుల రీడింగ్ స్కిల్స్ పరిశీలన**

**జలుమూరు, జులై 27(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని, వంట ఏజెన్సీ సభ్యులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని జలుమూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు ఆదేశించారు. సోమవారం జలుమూరు మండలం గొల్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల రీడింగ్ స్కిల్స్‌ను పరిశీలించి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించిన ఎంఈఓ, వంట ఏజెన్సీ సభ్యులతో మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని సమయానికి అందించాలని ఆదేశించారు. వంటశాల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార తయారీలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తప్పనిసరిగా వేడి నీటిని అందించాలని, వారి ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



## పంటల బీమా నమోదు చేసుకోవాలి



**మెళియాపుట్టి, జులై 27(వార్త):** ప్రతి రైతు తన పండించే పంటకు పంటల భీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి ఎస్. దానకర్ణుడు సోమవారం నాడు ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. పంటల భీమా నమోదు చేసుకునేందుకు 2026 ఆగస్టు 15 తేదీ లోగ నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ ఖరీఫ్ లో వరి సాగు చేస్తున్న ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పంటల భీమా నమోదు చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల తదితర వాటివల్ల కలిగే పంట నష్టాలను పంటల భీమా చేసుకోవడం వల్ల రైతులు పంటల భీమా పొందుతారన్నారు. బ్యాంకులో లోను తీసుకున్న రైతులు బ్యాంకుల ద్వారా అలాగే బ్యాంకులో లోను తీసుకోకపోయిన రైతులు మీసేవ/సిఎస్సి సెంటర్ల ద్వారా పంటల భీమా నమోదు చేయించు కోవచ్చునని, వరి పంటకి ఎకరాకి 160 రూపాయలు భీమాగా చెల్లించాలన్నారు. పంటల బీమా విషయంలో రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న స్థానిక రైతు సేవ కేంద్రాన్ని లేదా మండల వ్యవసాయధికారిని సంప్రదించాలన్నారు.

## ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి





**మెళియాపుట్టి, జులై 27(వార్త):** చదువుతూ మధ్యలో ఆపేసిన వారు, ఉద్యోగులు, మహిళలు, దివ్యాంగులు, ఇతర కారణాలతో సాధారణ పాఠశాలల్లో చదవలేని వారు ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకునే విధానాన్ని ప్రభుత్వం అందిస్తుందని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జి. పి. చంద్రభూషణరావు అన్నారు. ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా నేతృత్వంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో ఓపెన్ స్కూల్‌పై అవగాహన సదస్సు (ఒకరోజు శిక్షణ) కార్యక్రమాన్ని సోమవారం నాడు నిర్వహించారు. మండల స్థాయిలో ఓపెన్ స్కూల్ విద్యా విధానంపై అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జి.పి చంద్రభూషణ రావు హాజరై ఓపెన్ స్కూల్ విద్యా విధానం యొక్క ప్రాముఖ్యత పై అనేక అంశాలను తెలియపరిచారు. గ్రామస్థాయిలో అర్హులైన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్‌లో చేర్పించేందుకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు, విద్యా విధానం, పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు లభించే అవకాశాలపై సమగ్ర అవగాహన, సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ఓపెన్ స్కూల్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగాఓపెన్ స్కూల్ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, మండల విద్యాశాఖ అధికారులు ఎస్. దేవేందర్ రావు, మల్లారెడ్డి పద్మనాభం, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు చిట్టిబాబు, శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ గణేష్, ఏపీఎం త్రినాధమ్మ, సీఆర్పీలు, సచివాలయ విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్వైజర్ అమరావతి వివిధ శాఖల అధికారులు, పార్ట్‌టైమ్ ఇన్స్ట్రక్టర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎం ఆర్ సి సిబ్బంది తదితరులు పాల్గున్నారు.

## జర్నలిస్టుల హక్కులపై జంతర్‌మంతర్‌లో పోరాటం

**సోంపేట, జులై 27 (వార్త):** జర్నలిస్టుల హక్కుల సాధన కోసం వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ఇండియన్ ఫెడరేషన్ వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం కొనసాగింది. సోంపేట ప్రాంతానికి చెందిన ఉద్దానం దినపత్రిక వ్యవస్థాపకుడు, సంపాదకుడు భావన శ్రీకాంత్ హాజరయ్యారు. శ్రీకాంత్ స్థానిక విలేకరులకు వివరాలను అందజేశారు. దేశంలో ఎన్నో వర్గాలు అన్యాయాలకు గురై హక్కుల కోసం పోరాడుతున్న పరిస్థితులను ప్రపంచవ్యాప్తంగా ప్రసారం చేస్తున్న జర్నలిస్టులకు ఇప్పటికీ అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఒక్కరోజు శాంతియుత దీక్ష జంతర్ మంతర్లో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఇండియన్ ఫెడరేషన్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ ఫెడరేషన్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. ఏపీఎఫ్డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఎన్. ఈశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా నుంచి జర్నలిస్టుల బృందం ఢిల్లీ చేరుకొని పోరుబాటలో పాల్గొన్నట్లు తెలిపారు. జర్నలిస్టులు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మీడియా యాజమాన్యాలు అండగా ఉండడం లేదని అన్నారు. ఆరోగ్య, వృత్తి భద్రత లేని పరిస్థితుల్లో కలం కార్మికులు తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రైల్వే పాస్ 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని, జర్నలిస్టులకు రక్షణ చట్టం పార్లమెంట్లో ఆమోదించాలని నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని మీడియా సంస్థలు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.




## శ్రీకాకుళం

## వైసీపీ యువత ర్యాలీ విజయవంతం చేయండి



**ఇచ్ఛాపురం, జులై 27 (వార్త):** ఇచ్ఛాపురం వైసీపీ కార్యాలయంలో యువత విద్యార్థి విభాగం ర్యాలీ పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 28న రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు,నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రతి జిల్లా కేంద్రంలోనూ వై. యస్.ఆర్ కాంగ్రెస్ యువజన విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీలు నిర్వహిస్తునట్లు నియోజక వర్గ వైస్సార్సీపీ యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జ్యోతి రావ్ పూలే విగ్రహం వద్ద నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ హాజరై ర్యాలీ విజయవంతం చెయ్యాలని కోరారు. కార్యాలయం వద్ద వైసీపీ నియోజకవర్గం యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యువత విద్యార్థి విభాగం ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ , మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రత్తి అన్వేష్,జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతీదివ్య, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, సోంపేట జడ్పీటీసి తడక యశోద తడక జోగారావు, ఇచ్ఛాపురం మండల పార్టీ అధ్యక్షులు ఆసి క్రిష్ణారెడ్డి , ఆసి పురుషోత్తం రెడ్డి, మాజీ జడ్పీటీసి దక్కత నూకయ్య రెడ్డి, కంచిలి యువజన అధ్యక్షులు మద్దు అభి యాదవ్, చాట్ల లోహిదాస్ రెడ్డి, సప్ప వంశీయాదవ్, ఇసురు పరశురామ్, జుత్తు కామేష్, శ్రీరామ్ రెడ్డి, రమేష్, చంద్రయ్య, భాస్కర్, యాదవరెడ్డి, నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

## నారు పోసినా నీరు లేక..

**-వాటర్ పైపులతో నీళ్లు పోసి కాపాడుకుంటున్న రైతులు**



**జి.సిగడాం, జులై 27(వార్త):** జి.సిగడాం మండలంలో పది రోజులుగా వర్షాలు లేక ఖరీఫ్ సాగుకు కష్టాలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల వరి విత్తనాలు వేసి భూమిలో తగినంత తేమ లేక వేసిన విత్తనం మొలక రాలేదు. మరికొన్ని చోట్ల మొలకొచ్చి ఎదిగే సమయంలో వర్షాలు కురవక నారుమడులు బీటలు వారి ఎండిపోతున్నాయి. దీంతో రైతులు గత్యంతరం లేక దూర ప్రాంతాల బావుల నుండి నీరు తెచ్చుకుని మరికొందరు ఇంటి వద్ద నుండే డ్రమ్ము నుండి ని ఎద్దుల బండ్లలు, టాక్టర్ సహాయంతో నీరును తీసుకొనిపొయి నారుమడులను తడుపుతున్నారు.

## లైబ్రరీలో మౌలిక వసతులు మెరుగుపర్చండి



**ఇచ్ఛాపురం, జులై 27 (వార్త):** భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియా రంగనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం పట్టణంలోని "శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన పురాతన ప్రజా గ్రంథాలయం రామకృష్ణ ఫ్రీ రీడింగ్ రూమ్ అండ్ లైబ్రరీ లో గల పలు సమస్యలపై ఇచ్ఛాపురం పురపాలక సంఘం కమీషనర్ నల్లి రమేష్ కి వినతి పత్రం అందించారు.గ్రంథాలయం ప్రధాన ద్వారాలు దెబ్బతిన్నందున వాటిని మరమ్మతులు చేసి భద్రతను మెరుగుపరచాలని,డీఎస్సీ, ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ, బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్సీ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన తాజా పుస్తకాలను అందుబాటులో ఉంచాలని, భారత స్వాతంత్ర్య సమరయోధులు, భారత రాజ్యాంగం, జాతీయ నాయకుల మహనీయుల జీవిత చరిత్రలకు సంబంధించిన నాణ్యమైన పుస్తకాలను గ్రంథాలయంలో ఏర్పాటు చేయాలని .. పాఠకుల సౌకర్యార్థం పరిశుభ్రమైన టాయిలెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని . పాడైపోయిన సిమెంట్ బెంచీల స్థానంలో కొత్త బెంచీలు ఏర్పాటు చేయాలని, గ్రంథాలయంలో నిల్వ ఉంచిన పాడైపోయిన, ఉపయోగం లేని వస్తువులను తొలగించాలి. వాటి కారణంగా దోమల బెడద, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోందని, గ్రంథాలయ ప్రాంగణంలో నీడనిచ్చే పర్యావరణహిత మొక్కలను నాటి, పరిశుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువమోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ భైరిశెట్టి గోపి, యువమోర్చా సభ్యుడు జగన్ పట్నాయక్ పాల్గొన్నారు.

## 40ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

**మందస, జులై 27(వార్త):** నలభై ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యాధికారులు కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో కామ్రేడ్ మార్పు పద్మనాభం ట్రస్ట్(హరిపురం) ఆధ్వర్యంలో మార్పు పద్మనాభం స్మారక గ్రంథాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 40సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. హరిపురం గ్రామపెద్దలు మట్ట ఖగేశ్వరరావు, నల్ల హడ్డి మాట్లాడుతూ అన్ని రకాలైన నేత్ర సంబంధిత శస్త్ర చికిత్సలు, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా జరుగుతాయన్నారు. ప్రతీ ఒక్కరు కంటి సంరక్షణ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆప్టోమ్ జడ మణికంఠ కంటి పరీక్షలు నిర్వహించారు. 74మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 30 మందిని కేటరాక్ట్ సర్జరీకై శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో క్యాంపు జూనియర్ మేనేజర్ టి.రామారావు కూడా పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఇంటింటికీ కూటమి ప్రభుత్వ అభివృద్ధి

- సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన
- ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆముదాలవలస, జులై 27(వార్త):** కలివరం పంచాయతీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం – సంక్షేమ విజయాలు, ప్రజా పాలన – ఇంటింటికీ అభివృద్ధి" కార్యక్రమంలో ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియూసీ చైర్మన్ శ్రీ కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందని వివరించారు. కలివరం పంచాయతీలో కూడా వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత, మండల అధ్యక్షుడు నూకరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమిళ్ శేఖర్, నారాయణపురం ఆనకట్ట చైర్మన్ సనపల డిల్లేశ్వరావు, టీడీపీ కార్యదర్శి వండాన ఉదయ్, అన్నెపు భాస్కరరావు, జనసేన మండల అధ్యక్షుడు పైడి మురళి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సాయి పల్లకీ సేవ

- గోపాలపురంలో భక్తుల సందడి
- పురవీధుల్లో సాయినామ స్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం



**సారవకోట, జులై 27 (వార్త):** బుడితి సమీపంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం ఉదయం శ్రీ సాయిబాబా పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిని వివిధ రకాల పూలమాలలతో సుందరంగా అలంకరించి, శ్రీ సాయిబాబా చిత్రపటాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం సాయినామ స్మరణతో భజనలు నిర్వహిస్తూ పల్లకిని గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. భక్తులు "ఓం సాయి రామ్" నామస్మరణ చేస్తూ ఆధ్యాత్మిక భక్తి భావాన్ని చాటుకున్నారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు సాయిబాబాకు ప్రత్యేక హారతులు సమర్పించి ఆశీర్వాదాలు పొందారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పల్లకీ సేవ కొనసాగగా, స్థానికులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయి పల్లకీ సేవను విజయవంతం చేశారు. భక్తి, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

- కాలు విరగడంతో ఆస్పత్రికి తరలింపు
- కేసు నమోదు చేసిన పోలీసులు



**నరసన్నపేట, జులై 27 (వార్త):** నరసన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు పట్టణంలోని కొత్తవీధికి చెందిన కొనపల రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో రాజశేఖర్ కుడికాలు విరిగిపోగా, తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## సంతలో తనిఖీలు

- వినియోగదారులకు కచ్చితమైన తూనికతోనే సరుకులు అందించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: తూనికలు, కొలతల శాఖ అధికారుల హెచ్చరిక

**నరసన్నపేట, జులై 27 (వార్త):** నరసన్నపేటలోని సోమవారం సంత ప్రాంగణంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులకు సరైన తూనికతో నాణ్యమైన సేవలు అందేలా దుకాణాల్లో వినియోగిస్తున్న త్రాసులు, కాటాలు, తూనిక రాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖాధికారి చింతాడ గోవిందరావు మాట్లాడుతూ, వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధృవీకరించిన తూనికలు, కొలతల పరికరాలనే వినియోగించాలని సూచించారు. వినియోగదారులకు కచ్చితమైన తూనికతో సరుకులు అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని అన్నారు. అమ్మకాల్లో తక్కువ తూనికతో మోసాలకు పాల్పడినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. తూనికలు, కొలతల పరికరాలను నిర్దిష్ట వ్యవధిలో ధ్రువీకరించుకోవాలని, నిబంధనలను పాటిస్తూ వ్యాపారం నిర్వహించాలని సూచించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణతో పాటు వ్యాపార లావాదేవీల్లో పారదర్శకతను నెలకొల్పేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



## శివరాంపురంలో తాగునీటికి కటకట

- జల్ జీవన్ మిషన్ పైపులైన్ ఉన్నా ప్రారంభం కాని నీటి సరఫరా
- వెంటనే తాగునీరు అందించాలని గ్రామస్థుల విజ్ఞప్తి



**సారవకోట, జులై 27 (వార్త):** శివరాంపురం గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రంగా మారుతోంది. జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పైపులైన్ ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటి వరకు నీటి సరఫరా ప్రారంభం కాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామంలోని వ్యవసాయ బావులు ఎండిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ నీటి వనరులు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో జల్ జీవన్ మిషన్ పథకం అమలు చేసినప్పటికీ, పైపులైన్ ద్వారా నీటి సరఫరా ప్రారంభం కాకపోవడం వల్ల పథకం లక్ష్యం నెరవేరడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో శివరాంపురం గ్రామానికి జల్ జీవన్ మిషన్ పైపులైన్ ద్వారా వెంటనే తాగునీటి సరఫరా ప్రారంభించి ప్రజల దాహార్తిని తీర్చాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

## గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాల ఎంఈవో ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల నోట్స్, హోంవర్క్ పరిశీలన
- ప్రతి విద్యార్థికి వర్క్‌బుక్ అందించాలని ఉపాధ్యాయులకు సూచన

**నరసన్నపేట, జులై 27 (వార్త):** గొట్టిపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల అభ్యాస పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. ముందుగా విద్యార్థుల నోట్స్ పుస్తకాలు, హోంవర్క్‌ను పరిశీలించిన ఎంఈఓ, విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకుని వారికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా హోంవర్క్ పూర్తి చేయడంతో పాటు పాఠాలను శ్రద్ధగా అభ్యసించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయురాలు జ్యోతితో మాట్లాడిన ఆయన, ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా హోంవర్క్‌తో పాటు వర్క్‌బుక్ అందించి, అందులోని వ్యాయామాలను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పఠన, లిఖిత నైపుణ్యాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్న ఎంఈఓ, అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.



## ఎంపీ కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో మెరిసిన విద్యార్థినులు

- జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన దేవిశ్రీ, లహరి
- విజేతలను అభినందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

**నరసన్నపేట, జులై 27 (వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపీ కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. విజేతల విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం శ్రీకాకుళంలో నిర్వహించిన ఎంపీ కప్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన దేవిశ్రీ, లహరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రన్నరప్‌గా నిలిచారు. క్రీడా నైపుణ్యంతో పోటీల్లో ఆకట్టుకుని జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూపవతి విజేతలను అభినందిస్తూ, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థినుల విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విజేతలను అభినందించి, వారి క్రీడా ప్రస్థానం మరిన్ని విజయాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.



## పోటీ పరీక్షల్లో విజయమే లక్ష్యం కావాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జర్నల్స్, న్యూస్ పేపర్స్ క్లబ్ ఏర్పాటు
- రోజుకొక కేటాయించాలని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సూచన



**నరసన్నపేట, జులై 27 (వార్త):** పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విద్యార్థులు లక్ష్యంతో కృషి చేయాలని నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మరపట్ల పవన్ సూచించారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల పోటీ పరీక్షల సన్నద్ధతను దృష్టిలో ఉంచుకుని జర్నల్స్‌తో పాటు న్యూస్ పేపర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు అవసరమైన పాఠ్యాంశాలు, సమకాలీన అంశాలు, సాధారణ విజ్ఞానానికి సంబంధించిన సమాచారం విద్యార్థులకు అందుబాటులో ఉండేలా క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్లబ్ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్‌ను విద్యార్థులు సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యతో పాటు ప్రతిరోజూ కనీసం ఒక గంట సమయాన్ని పోటీ పరీక్షల కోసం కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివితే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలను సులభంగా అందిపుచ్చుకోవచ్చన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవడంతో పాటు రోజువారీ వార్తలు, సమకాలీన పరిణామాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ మరపట్ల పవన్ సూచించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ క్లబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఉత్సాహంగా ఇంటింటికీ తెలుగుదేశం

- ప్రభుత్వ ఆశయాలు, పథకాలను వివరించిన నాయకులు
- టీడీపీకి మంచి ఆదరణ లభిస్తోంది: అధ్యక్షుడు బావన దుర్యోధన



**మందస, జులై 27(వార్త):** మందస మండలంలో ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. బొగాబంద గ్రామ పంచాయతీ పరిధిలో ఈ కార్యక్రమం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రజల ఆదరణ మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలిసారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, వ్యవసాయం, మహిళా సాధికారత, పింఛన్లు వంటి వివిధ రంగాల్లో సాధించిన పురోగతిని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు ద్వారా, నేరుగా మౌఖికంగా ప్రజలకు పూస గుచ్చినట్లు తెలియజేశారు. స్థానిక ప్రజల సమస్యలను, వినతులను ఓపికగా ఆలకించి, వాటి పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మండల కార్యదర్శి సాలీన మాధవ రావు, క్లస్టర్ ఇన్ చార్జి ముంజేటి చంద్రశేఖర్, కోఇంచార్జ్ అడ్డి ఈశ్వరరావు, లబ్బ రుద్రయ్య, తమరియ భాస్కరరావు, రట్టి లింగరాజు, నవీన్ యాదవ్, ఔగాన ఈశ్వరరావు, అందాల గిరి, దీనబంధు, అగ్గున జయరాజు, అల్లుమల నారాయణ రావు, తలగాన కాంతారావు, సవర రాజు పాటు పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు, బొగా బంద గ్రామ పంచాయతీ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చిన్న జొన్నవలస బావి వద్ద మురుగు నీరు.. గ్రామస్తుల ఆందోళన

**ఆముదాలవలస, జులై 27 (వార్త):** ఆముదాలవలస మండలంలోని టీ. జొన్నవలస పంచాయతీ పరిధిలోని చిన్న జొన్నవలస గ్రామంలో బావి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో తాగునీటి అవసరాల కోసం ఈ బావిని అధిక సంఖ్యలో ప్రజలు వినియోగిస్తున్నప్పటికీ, బావి చుట్టూ పేరుకుపోయిన మురుగు నీరు మరియు అపరిశుభ్ర వాతావరణం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఇప్పటివరకు పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బావి పరిసరాలను వెంటనే శుభ్రపరచి, నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని గ్రామ సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

-కూటమి ప్రభుత్వ అభివృద్ధి పై ఇంటింటా ప్రచారం

- ప్రజలకు అందుబాటులో లేని అధికారులపై చర్యలు తీసుకుంటాం

- ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందాలి

-పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



**ఎల్ఎన్ పేట, జులై 27 (వార్త):** అభివృద్దే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి రెండేళ్లలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సోమవారం మండలంలోని పెద్దకోట గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు.అలాగే కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకత పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతీ ఇంటికీ చేరవేయడం ప్రతీ కార్యకర్త భాద్యతని పేర్కొన్నారు. గ్రామ వీధిలైట్లను ఆయన ప్రారంభించారు. ముందుగా పెద్దకోట గ్రామ మహిళలు మాట్లాడుతూ గ్రామానికి స్మశాన వాటిక, రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ఆయన స్పందించి త్వరలో స్మశానవాటిక, రోడ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసియస్ అధ్యక్షులు కాగాన మన్మధరావు, పాతపట్నం నియోజకవర్గ తెలుగుయువత నాయకులు అంపిలి పోలినాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొవిలాపు క్రిష్ణమాచార్య,మండల టిడిపి అధ్యక్షులు మెండ మనోహర్, మాజీ సర్పంచ్ లు ,నాయకులు వెలమల గోవిందరావు, చింతాడ శ్రీనివాస రావు, నడిపిల్లి నారాయణరావు, కుంచాల బాలక్రిష్ణ, కొమరావు చిరంజీవి, కాగాన నిరేష్,గుండపు గణేష్, కాగాన రాజారావు, చింతాడ వెంకటరమణ, జమ్మి మోహనరావు,యారబాటి రాంబాబు,మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పలాసలో ప్రమాదం రాజకీయ వివాదంగా మారింది

- సీదిరి, ఆరవ్ అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపే

- వైఎస్సార్‌సీపీ నాయకుడు “సాసుమను” ఆందోళన



**పలాస, జులై 27 (వార్త):** మాజీ మంత్రి సీదిరి, కుమారుడు ఆరవ్ అరెస్ట్‌పై రాజకీయ కక్ష సాధింపేలో భాగంలోనే పలాసలో ప్రమాదం రాజకీయ వివాదంగా మారిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు “సాసుమను శివాజీ నాయుడు” ఆందోళన వ్యక్తం చేశారు. పలాస ప్రగతి భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ జాతీయ రహదారిపై జరిగిన దురదృష్టకర రోడ్డు ప్రమాదంలో ఒక నిరుపేద గౌరెల కాపరి దుబ్బ దానయ్య మరణించిన ఘటన అనేక రాజకీయ విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే, పోలీసులు విచారణలో, ప్రమాద సమయంలో కుమారుడిని రక్షించేందుకు సాక్ష్యాలను తారుమారు చేశారనే ఆరోపణల నేపథ్యంలో తండ్రీకొడుకులిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని ఆయన మండిపడ్డారు. పలాస వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నారని తెలిపారు. సాధారణంగా రోడ్డు ప్రమాదంగా నమోదు చేయాల్సిన విషయాన్ని రాజకీయ ఒత్తిడితో హత్య కేసుగా మార్చడం వలన చట్ట దుర్వినియోగానికి నిదర్శనమని తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. ఇది ప్రజా న్యాయ సంబంధాలపై ప్రభావం చూపుతుందని, ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఈ చర్యలు చేస్తోందనే ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయస్సులో చదువుతున్న విద్యార్థి ఆరవ్ పై కేసులు పెట్టి ఒక విద్యార్థి కెరీర్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు యువకుడు నీట్ పరీక్ష రాసి ఉన్నత పఠనానికి సిద్ధమవుతున్న నేపథ్యాన్ని గుర్తుచేసుకొని, కోర్టులు సాధారణంగా పరీక్షలు, కౌన్సిలింగ్ వంటి విద్యార్థి కార్యక్రమాలకు హాజరుకానివ్వటానికి ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం, పోలీసులు కొందరు డాక్టర్ అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మపై అక్రమ కేసులో ఇరికించిరిమాండ్‌కు పంపారని ఆయన ధ్వజమెత్తారు.

## రాజకీయ కక్షతోనే డాక్టర్‌ను అరెస్టు చేశారు

-కడిగిన ముత్యంలా సీదిరి తిరిగి వస్తారు

- కక్ష రాజకీయాలకు బుద్ధి చెప్పాలని అభిషేకాలు

- ఉమాలింగేశ్వరాలయంలో వైకాపా నాయకులు పూజలు





**పలాస, జులై 27 (వార్త):** రాజకీయ కక్షతోనే డాక్టర్ ను అరెస్టు చేశారని చేశారని, పలాస నియోజకవర్గంలో కక్ష రాజకీయాలు చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలని, కాశీబుగ్గ రామాలయ ప్రాంగణంలో ఉన్న ఉమాలింగేశ్వర స్వామికి పలాస కాశీబుగ్గ మున్సిపల్, మండల అధ్యక్షులు శిష్టు గోపి, దువ్వాడ రవిలు వైకాపా నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మహిళలతో కలిసి సోమవారం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. తమ నాయకుడు ప్రజల క్షేమం కోరి పనిచేసేవాడని భావోద్వేగానికి పలువురు లోనయ్యారు. వారు మాట్లాడుతూ ఓ వైపు ప్రజల ప్రాణాలను కాపాడాలనే తపన మరోవైపు దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధితో నరకయాతన అనుభవిస్తున్న ఉద్దానం ప్రాంత వాసులకు శాశ్వత పరిష్కారం చూపిన ప్రజా వైద్యుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఓ సామాన్య వైద్యుడిగా ప్రజల నాడిపట్టి నాయకుడిగా రూ.2,000 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చి పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఆయనపై ప్రస్తుత ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. ఉద్దానం ప్రాంతంలో రూ.50 కోట్లతో 200 పడకల కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్ను వేగంగా అందుబాటులోకి తెచ్చి ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టిన ఘనత అప్పలరాజుకే దక్కుతుందని నాయకులు కొనియాడారు. గతంలో ఏ నాయకుడూ చేయని విధంగా పలాస రూపురేఖలను మార్చేసి మౌలిక వసతులు, సంక్షేమానికి పెద్దపీట వేసిన ప్రజా సేవకుడిపై, ఆయన కుమారుడు ఆరవవర్మపై అక్రమ కేసులు బనాయించి రిమాండ్కు పంపడాన్ని ప్రజాస్వామ్య వాదులు ఖండిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నాయకులు, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విరిసినదీ.. బ్రహ్మ కమలం

- ఉపాధ్యాయుడి ఇంట అరుదైన పుష్పాన్ని తిలకించిన స్థానికులు

-ఆషాఢ మాసంలో ఒక్కసారి మాత్రమే వికసించే విశిష్ట పుష్పం



**నరసన్నపేట, జులై 27 (వార్త):** ఏడాదికి ఒక్కసారి మాత్రమే వికసించే అరుదైన బ్రహ్మ కమలం నరసన్నపేట పట్టణంలోని ఓ ఉపాధ్యాయుడి ఇంట విరబూసి స్థానికులను ఆకట్టుకుంది. ఆదివారం అర్ధరాత్రి వేళ ఉపాధ్యాయుడు మోహనరావు నివాసంలో ఈ పుష్పం వికసించడంతో దానిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ, బ్రహ్మ కమలం సాధారణంగా ఏడాదికి ఒక్కసారి, ముఖ్యంగా ఆషాఢ మాసంలో రాత్రి వేళ వికసిస్తుందని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో వికసించే ఈ పుష్పాన్ని తిలకించడం శుభప్రదంగా, అదృష్టకరంగా భావిస్తారని పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో బ్రహ్మ కమలానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని, ఈ పుష్పాన్ని భగవంతుడి పూజల్లో వినియోగిస్తారని వివరించారు. పుష్పం అందం, సువాసనతో పాటు అరుదుగా వికసించడం వల్ల దీనిని చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారని చెప్పారు. బ్రహ్మ కమలం వికసించిన విషయం తెలుసుకున్న స్థానికులు మోహనరావు ఇంటికి చేరుకుని పుష్పాన్ని తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రసాదించిన ఈ అరుదైన అందాన్ని ప్రత్యక్షంగా చూడటం ఆనందాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు.

## విద్యార్థులు చెడుకు దూరంగా ఉండాలి



**మందస, జులై 27(వార్త):** విద్యార్థులు చెడుకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉండాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కోరారు. హరిపురంలో గల గీతం హైస్కూల్లో అభయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నిబద్ధతతో ముందుకు సాగాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కృషి, పట్టదల అంకితభావంతో చదువుకోవాలని, మంచి భవిష్యత్ పొందాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారుర. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గీతం హైస్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

## లక్ష్యంతో ప్రణాళికయుతంగా ముందుకు సాగండి



**మెళియాపుట్టి, జులై 27 (వార్త):** విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళికంగా ముందుకు సాగాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జి పి చంద్రభూషణరావు అన్నారు. మెలియాపుట్టి మండల కేంద్రంలోని ఉన్న కేజీబీవీ పాఠశాలను ఆయన సోమవారం నాడు సందర్శించారు. పాఠశాలలో తరగతి గదిలో నిర్వహణ మధ్యాహ్న భోజన పథకం నాణ్యత ప్రమాణాలు పరిశీలన చేయడంతో పాటు విద్యార్థులకు క్లాసులో పాఠం సైతం బోధించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళిక యుతంగా ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు అధిరోహించి, పదిమందికి ఆదర్శంగా ఉండవచ్చునని అనేకంశాలు మాట్లాడారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ప్రయోగశాల, గ్రంథాలయం తదితర విభాగాలను పరిశీలనతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన ఆయన, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ సందర్శనలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జి.పి. చంద్రభూషణరావు తోపాటు మండల విద్యాశాఖ అధికారి మల్లారెడ్డి పద్మనాభరావు, ప్రిన్సిపల్ రమ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులున్నారు.

## షిరిడిసాయి మందిరంలో రేపు గురుపూర్ణిమ వేడుకలు



**మందస, జులై 27(వార్త):** మందస పట్టణంలోని శ్రీషిరిడి సాయి ధ్యాన మందిరంలో ఈ నెల 29న గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, సోషల్ వర్కర్, ఆధ్యాత్మికవేత్త గురుసాయి గిన్ని తిరుపతిరెడ్డి చెప్పారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాస పూర్ణిమ సందర్భంగా ఈ నెల 29న బుధవారం జగద్గురు శ్రీ షిరిడి సాయినాథ్ మహరాజ్ వారి గురుపూర్ణిమ మహోత్సవం శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరంలో ఆలయ ప్రధానార్చకులు కొమ్మాజోష్యుల సీతారామశర్మ కార్యక్రమములు జరుపబడుతుందన్నారు. భక్తులు యావన్మంది విచ్చేసి కార్యక్రమంలో పాల్గొని సాయినాథుని ఆశీస్సులతో తీర్ధప్రసాదములు స్వీకరించగలరని ఆయన కోరారు. ఉదయం 5.10ని గంటలకు అఖండజ్యోతి ప్రజ్వలన, 5.15గంటలకు ఓంకార సుప్రభాత తొలిహారతి, 5.45గంటల నుండి మంగళస్నానములు, క్షీరాభిషేకం, 8.15గంటలకు విఘ్నేశ్వరపూజ, శ్రీ సాయి అష్టోత్ర శతనామావళి, పూజలు, 9గంటలకు పూర్ణకుంభం, శ్రీ షిరిడిసాయి బాబా వారి ఉత్సవం(మందిర ప్రాంగణములో), 9.30గంటలకు భక్తులచే శ్రీ షిరిడిసాయిచాలీసా, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, 10గంటలకు మహేంద్రకళామండలి వారిచే సంగీతమాధురి గాన కచేరి 11.15గంటలకు మహాధుని పూజా ఉత్సవం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12గంటలకు మధ్యాహ్నహారతి, 12.15గంటలకు అన్న సమారాధన సేవ, సాయంత్రం 6.15గంటలకు కాగడ హారతి(సంధ్య హారతి), రాత్రి 8.15గంటలకు బాబా వారి శేజ హరతులు జరుగుతాయన్నారు. అదేవిధంగా త్వరలో నూతనంగా ప్రారంభించనున్న శ్రీ సాయి అద్భుత ఆశ్రమంలో గురువులచే ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేయబడుతుందన్నారు. భక్తులు పాల్గొని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఘనంగా బండార్లమ్మతల్లి 18వ వార్షికోత్సవం



**మెళియాపుట్టి, జులై 27 (వార్త):** మెళియాపుట్టిలో ఉన్న బండారులమ్మ తల్లి 18వ వార్షికోత్సవ వేడుకలను భక్తులు, గ్రామస్తులు సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలతో అమ్మవారికి పూజా కార్యక్రమం జరిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో అంగరంగ వైభవంగా మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన సంతర్పణ గావించారు. బండార్లమ్మ తల్లి మహోత్సవాలు విజయవంతం కావడానికి ఆలయ కమిటీ సభ్యులు కొత్త శ్రీనివాస్, రాజారెడ్డి, దుక్క ఈశ్వరరావు, బసవ సంతోష్, నర్సింగ పాత్రో, రమేష్ బరోడా, కొత్త రాజేష్, భక్తులు యువకులు మహిళలు, గ్రామ పెద్దలు, సమిష్టిగా వ్యవహరించి ఘనంగా నిర్వహించారు.



## అభివృద్ధిపై డోర్ టూ డోర్ ప్రచారం

**హిరమండలం, జులై 27 (వార్త):** కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి రెండేళ్లలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సోమవారం గొట్ట గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ు

ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పారదర్శకత పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి ‘సమాన ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.

కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బాధితులను పరామర్శించిన చింతాడ రవికుమార్

**ఆమదాలవలస, జులై 27 (వార్త):** ఆమదాలవలస నియోజకవర్గంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురు బాధితులను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమదాలవలస మండలం కోర్లకోట గ్రామానికి చెందిన సువ్వారి అప్పన్న శ్రీకాకుళం ట్రస్ట్ హాస్పిటల్ ఐసీయూలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే సరుబుజ్జిలి మండలం సరుబుజ్జిలి గ్రామానికి చెందిన గుజ్జల అనిల్ కుమార్ ఇటీవల విశాఖపట్నంలోని మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొంది ప్రస్తుతం కోలుకుంటున్న నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సరుబుజ్జిలి గ్రామానికి చెందిన రాకోటి గోవిందరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్నందున, వారిని సరుబుజ్జిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు సురవరపు నాగేశ్వరరావు కలిసి పరామర్శించి, ధైర్యం చెప్పారు. బాధితులు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546